విద్య, రైతు కమిషన్లు ఏర్పాటు చేస్తాం

- కౌలు రైతు రక్షణ చట్టం తెస్తాం
- పంటల బీమా అమలు చేస్తాం
- పౌర సమాజం ప్రతినిధులతో భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కొత్తగా రైతు కమిషన్, ఎడ్యుకేషన్ కమిషన్ ఏర్పాటుచేయాలని యోచిస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. సచివాలయంలో శుక్రవారం ఆయన తన చాంబర్‌లో ప్రొఫెసర్లు హరగోపాల్, కోదండరాం, విశ్వేశ్వర్ రావు, రమామేల్కొటే, రియాజ్, పురోషోత్తమ్‌తోపాటు యోగేంద్రయాదవ్, గాదె ఇన్నయ్య తదితర పౌర సమాజం ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తీసుకున్న చర్యలను సీఎం వారికి వివరించారు. త్వరలో రైతు కమిషన్, ఎడ్యుకేషన్ కమిషన్‌ను ఏర్పాటు చేయబోతున్నట్టు చెప్పారు. మన విద్యా విధానం ఎలా ఉండాలో ఎడ్యుకేషన్ కమిషన్ నిర్ణయిస్తుందని తెలిపారు. పంటల బీమా పథకాన్ని పకడ్బందీగా అమలుచేస్తామని పేర్కొన్నారు. కౌలు రైతుల రక్షణకు చట్టం తేవాలని యోచిస్తున్నట్టు వివరించారు. కౌలు రైతుల రక్షణ చట్టం ఏవిధంగా ఉంటే బాగుంటుందనే అంశంపై సూచనలు, సలహాలు స్వీకరించడానికి అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. రైతుభరోసా అనేది పెట్టుబడి సాయమని, దీనిని ఎవరికి ఇవ్వాలనే దానిపై విస్తృత చర్చ జరగాలని కోరుతున్నామని సీఎం అభిప్రాయపడ్డారు. నిస్సహాయులకు, నిజమైన లబ్ధిదారులకు అవసరమైతే చెప్పినదాని కంటే ఎక్కువ సహాయం చేయొచ్చని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలను 25 ఎకరాల్లో ఒకే ఇంటిగ్రేటెడ్ క్యాంపస్‌లో ఏర్పాటు చేయబోతున్నామని, దీనిని పైలట్ ప్రాజెక్టుగా కొడంగల్‌లో ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఉద్యోగాల భర్తీలో గత ప్రభుత్వంలో ఉన్న చిక్కుముడులను తొలగించి ఉద్యోగాలను భర్తీ చేశామని, చేస్తున్నామని వివరించారు. యూపీఎస్సీ తరహాలో టీఎస్‌పీఎస్సీ ద్వారా నియామకాలు చేపడతామని వెల్లడించారు. సమావేశంలో ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ కూడా పాల్గొన్నారు.

పౌర సమాజం ఢిల్లీదా? తెలంగాణదా?

- సచివాలయంతో దీపాదాస్ మున్షీకి సంబంధమేమిటి?
- అధికారిక భేటీలో ఏ హోదాతో పాల్గొంటున్నారు?
- రేవంత్‌పై అసహనమ్మకంతోనే హాజరవుతున్నారా?

హైదరాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ): తెలంగాణ పౌర సమాజానికి చెందిన పలువురు ప్రముఖులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన అధికారిక సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీ పాల్గొనడం వివాదస్పదమైంది. రాష్ట్రానికి సంబంధం లేని, ఎలాంటి అధికారిక హోదా లేని వ్యక్తిని సమావేశానికి ఎలా అనుమతించారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇది రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలపై ఢిల్లీ పెద్దల పెత్తనానికి నిదర్శనమనే విమర్శలు వినిపిస్తున్నాయి. తెలంగాణకు చెందిన ప్రముఖులతో నిర్వహించిన సమావేశంలో దీపాదాస్‌మున్షీ కూర్చోవడంతో 'ఇది తెలంగాణ పౌర సమాజంతో భేటీనా? ఢిల్లీ పౌర సమాజంతో భేటీనా?' అనే సెటైర్లు పేలుతున్నాయి. మరోవైపు ఈ వ్యవహారంపై ఆ పార్టీ సీనియర్ నేతల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి ఎవరితో సమావేశమవుతున్నారు? ఏం మాట్లాడుతున్నారు? అనే అంశాలపై ఢిల్లీ కాంగ్రెస్ అధిష్ఠానం కన్నేసి ఉంచిందని, రేవంత్‌రెడ్డిని పూర్తిస్థాయిలో విశ్వసించడంలేదనే చర్చ నడుస్తున్నది. గతంలో ప్రధానమంత్రిని కలవడానికి రేవంత్‌రెడ్డి వెళ్లినప్పుడు కూడా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను, కేంద్ర మంత్రులను కలవడానికి వెళ్లినప్పుడు తోడుగా మంత్రులు ఉండేలా పార్టీ అధిష్ఠానం చర్యలు తీసుకుంటున్నదని ఉదహరిస్తున్నారు. రేవంత్‌రెడ్డి కదలికలు, కార్యకలాపాలపై ఢిల్లీ అధిష్ఠానం ఎప్పటికప్పుడు కన్నేసి ఉంచిందని చెప్తున్నారు. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి గతంలో ఎప్పుడో ఒకసారి తెలంగాణకు వచ్చి వెళ్లేవారని, కానీ రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి ఇక్కడే మకాం వేస్తున్నారని, అధికారిక సమావేశాల్లో సైతం పాల్గొంటున్నారని విశ్లేషిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలోని అన్ని వర్గాలను ఆమె కలుస్తున్నారని, అధికారిక, అనధికారిక సమావేశాల్లో పాల్గొంటున్నారని పార్టీ నేతలు చెప్తున్నారు.

ఎలివేటెడ్ కారిడార్లకు లైన్‌క్లియర్

- రక్షణ శాఖ భూకేటాయింపునకు కేంద్రం అనుమతి
- హైదరాబాద్ రామగుండం, నాగ్‌పూర్ హైవే రూట్ క్లియర్
- ఉత్తర తెలంగాణకూ రవాణా సదుపాయాల విస్తరణ
- కేంద్ర రక్షణశాఖ మంత్రికి సీఎం రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు
- ఫలించిన గత బీఆర్ఎస్ సర్కారు పోరాటం

హైదరాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్-కరీంనగర్ రాజీవ్ రహదారితోపాటు హైదరాబాద్-నాగ్‌పూర్ జాతీయ రహదారిపై ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్ర రక్షణ శాఖ అనుమతి ఇచ్చింది. హైదరాబాద్‌లోని రక్షణ శాఖ భూముల మీదుగా ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి మార్గం సుగమమైంది. జనవరి 5న సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసి రక్షణ భూముల మీదుగా ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి అనుమతించాలని లేఖ అందజేశారు. వీటి నిర్మాణానికి శుక్రవారం ఉదయం అనుమతులు జారీ చేసింది. హైదరాబాద్ నగరాభివృద్ధికి అత్యంత కీలకమైన ఈ కారిడార్ల నిర్మాణానికి అనుమతించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీకి, కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు, ఆ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్ నుంచి కరీంనగర్-రామగుండంను కలిపే రాజీవ్ రహదారిలో ప్యారడైజ్ జంక్షన్ నుంచి అవుటర్ రింగు రోడ్డు జంక్షన్ వరకు ఆరు లేన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం, ఎంట్రీ, ఎగ్జిట్ ర్యాంపుల నిర్మాణానికి మొత్తంగా 11.30 కిలోమీటర్ల కారిడార్ నిర్మాణానికి 83 ఎకరాల భూమి అవసరమని రక్షణ శాఖ మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. నాగ్‌పూర్ హైవే (ఎన్‌హెచ్ -44)పై కండ్లకోయ సమీపంలోని ప్యారడైజ్ జంక్షన్ నుంచి అవుటర్ రింగ్ రోడ్డు వరకు ఎలివేటెడ్ కారిడార్ మొత్తంగా 18.30 కిలోమీటర్ల మేర ప్రతిపాదించామని, అందులో 12.68 కిలోమీటర్ల మేర ఆరులేన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి, నాలుగు ప్రాంతాల్లో ఎగ్జిట్, ఎంట్రీలకు, భవిష్యత్తులో డబుల్ డెక్కర్ (మెట్రో కోసం) కారిడార్, ఇతర నిర్మాణాలకు మొత్తంగా 56 ఎకరాల రక్షణ శాఖ భూములు బదిలీ చేయాలని రక్షణశాఖ మంత్రిని కోరారు. కేంద్రం ఇచ్చిన అనుమతులతో ఉత్తర తెలంగాణ దిశగా రవాణా మార్గాల అభివృద్ధికి మార్గం సుగమమైంది. అటు నిజామాబాద్, ఆదిలాబాద్, ఇటు కరీంనగర్ రామగుండం వెళ్లేందుకు సికింద్రాబాద్ ఏరియాలోని అత్యంత ఇబ్బందికరంగా మారిన ట్రాఫిక్ సమస్య తొలిగిపోనున్నది. హైదరాబాద్ నుంచి శామీర్‌పేట, హైదరాబాద్ నుంచి కండ్లకోయ వరకు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణంతో గ్రేటర్ సిటీ ఉత్తర దిశగా అభివృద్ధి పరుగులు తీయనున్నది. దీంతో జాతీయ రహదారుల విస్తరణకు సంబంధించి అడ్డంకిగా మారిన రక్షణ శాఖ భూముల అడ్డంకులు తొలిగిపోయాయి.

ఎట్టకేలకు దిగొచ్చిన రక్షణ శాఖ

కంటోన్మెంట్, మార్చి 1: సికింద్రాబాద్ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన కృషి నేడు ఫలితాలను ఇస్తున్నది. పదేండ్లుగా కేంద్రంతో బీఆర్ఎస్ చేసిన పోరాటం ఎట్టకేలకు విజయవంతమైంది. పట్టువదలని విక్రమార్కుడిలా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ చేసిన పోరుకు రక్షణ శాఖ దిగొచ్చింది. కంటోన్మెంట్ పరిధిలోని రాజీవ్ రహదారి, 44వ జాతీయ రహదారిలో స్కైవేల నిర్మాణానికి నిరుడు జూలై 31న జరిగిన క్యాబినెట్ సమావేశంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్ణయానికి రక్షణ శాఖ తాజాగా ఆమోదం తెలిపింది. ఆ మార్గాలలోని రక్షణశాఖ స్థలాలను కేటాయించాలని గత ప్రభుత్వం పదేండ్లుగా కేంద్రాన్ని కోరుతూ వచ్చింది. ఎట్టకేలకు దీనిపై సానుకూలంగా స్పందించిన రక్షణశాఖ ఆయా రహదారుల్లో తన ఆధీనంలో ఉన్న 33 ఎకరాలను గతంలోనే కేటాయించగా, తాజాగా మరో 150 ఎకరాలను కేటాయిస్తూ శుక్రవారం ఆమోదం తెలిపిందని కంటోన్మెంట్ బోర్డు సీఈవో మధుకర్‌నాయక్ వెల్లడించారు. రక్షణ శాఖ నుంచి భూసేకరణలో వచ్చిన అడ్డంకులతో ఈ పనులు ఆదిలోనే ఆగిపోయాయి. అయితే అప్పటి రాష్ట్ర మంత్రి కేటీఆర్, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో ఢిల్లీలో పలుమార్లు సమావేశమై సమస్యను వివరించడంతో కేంద్ర రక్షణశాఖ ఇప్పటికి మేల్కొనడంతో కంటోన్మెంట్ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పార్టీకి వెళ్లా.. డ్రగ్స్ తీసుకోలేదు

- పోలీసుల విచారణలో క్రిష్ వివరణ
- హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు
- వైద్య పరీక్షల కోసం నమూనాల సేకరణ
- మరో ఇద్దరు డ్రగ్స్ సప్లయర్ల కోసం గాలింపు

హైదరాబాద్, (నమస్తే తెలంగాణ)/ శేరిలింగంపల్లి, మార్చి 1 : ర్యాడిసన్ బ్లూ డ్రగ్స్ పార్టీ కేసులో నిందితుడిగా ఉన్న సినీ దర్శకుడు క్రిష్ గచ్చిబౌలి పోలీసుల విచారణకు శుక్రవారం హాజరయ్యారు. పరీక్షల కోసం అతడి నుంచి నమూనాలు సేకరించి ల్యాబ్‌కు తరలించిన పోలీసులు ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. తాను పార్టీకి హాజరైన మాట వాస్తవమేనని, డ్రగ్స్ మాత్రం తీసుకోలేదని చెప్పినట్టు తెలిసింది. ఈ కేసులో డ్రగ్స్ పార్టీ నిర్వహించిన వివేకానంద, టాలీవుడ్ నిర్మాత కేదారినాథ్, వ్యాపారవేత్త నిర్భయ్, డ్రగ్స్ సరఫరాదారులు అబ్బాస్ అలీ జాఫ్రీ, మీర్జా వహీద్, వివేకానంద డ్రైవర్ ప్రవీణ్‌లను పోలీసులు అరెస్టు చేయగా, నటి లిషీ గణేశా, యూట్యూబర్ శ్వేత, సందీప్, నీల్‌లు పరారీలో ఉన్నారు.

మరో ఇద్దరు డ్రగ్స్ సప్లయర్ల కూపీ..

డ్రగ్స్ సరఫరా చేసిన అబ్బాస్ పాతబస్తీకి చెందిన మీర్జా వహీద్ వద్ద కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడించడంతో మీర్జా వహీద్‌ను సైతం పోలీసులు అరెస్టు చేసి విచారించారు. ఈ క్రమంలో వహీద్‌కు డ్రగ్స్ సరఫరా చేసిన మరో ఇద్దరు సప్లయర్ల వివరాలను పోలీసులు సేకరించి, వారి కోసం గాలిస్తున్నట్టు సమాచారం.

ముందస్తు బెయిల్ ఇవ్వండి: క్రిష్

తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని డ్రగ్స్ కేసులో నిందితుడు సినీ దర్శకుడు క్రిష్ హైకోర్టును ఆశ్రయించడంతో జస్టిస్ జీ రాధారాణి శుక్రవారం విచారణ చేపట్టారు. మొదటి నిందితుడు జీ వివేకానంద ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా పిటిషనర్‌పై తప్పుడు కేసు పెట్టారని, ప్రధాన నిందితుడికి రిమాండ్ విధించేందుకు కింది కోర్టు నిరాకరించిందని క్రిష్ తరపు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. కేసు దర్యాప్తునకు పిటిషనర్ సహకరిస్తారని, పోలీసుల ఎదుట హాజరవుతారని వివరించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా క్రిష్‌పై తప్పుడు కేసు నమోదు చేశారన్నారు. పోలీసుల వివరణ నిమిత్తం విచారణ ఈ నెల 4కి వాయిదా పడింది.

సచివాలయంలో సీఎం రేవంత్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న మీడియా ప్రతినిధులు

అర్హులైన జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలు

జేఎన్‌జే సభ్యులకు సీఎం రేవంత్ రెడ్డి హామీ

హైదరాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలు కేటాయిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం సాయంత్రం సచివాలయంలో జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్టుల హౌజింగ్ సొసైటీ (జేఎన్‌జే)లో సభ్యులైన అన్ని పత్రికల, టీవీ మీడియాకు చెందిన ప్రధాన ప్రతినిధులు ముఖ్యమంత్రిని కలిశారు. జేఎన్‌జేకు ఇండ్ల స్థలాల అప్పగింత ప్రక్రియ వంద రోజుల్లోపు మొదలుపెడతామన్న హామీని అమలు చేసినందుకు వారు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఇండ్ల స్థలాల అప్పగింతపై రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డితో జేఎన్‌జే ప్రతినిధులు చర్చించి.. ప్రణాళికతో తన దగ్గరకొస్తే వెంటనే సంతకం చేస్తానని సీఎం వారికి హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఏ సంస్థకు నామినేటెడ్ చైర్మన్‌ను నియమించకుండా, కేవలం మీడియా అకాడమీకే చైర్మన్‌ను నియమించడాన్ని బట్టి తమ ప్రభుత్వం జర్నలిస్టులకు ఎంత ప్రాధాన్యం ఇస్తుందో అర్థం చేసుకోవాలని చెప్పారు. అర్హులైన మిగిలిన జర్నలిస్టులకు కూడా స్థలాలు ఇచ్చే విషయంలో కూడా మీడియా అకాడమీతో చర్చించి కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. వీరికి కూడా స్థలాలు ఇస్తామని స్పష్టంచేశారు. జర్నలిస్టుల ఆరోగ్యభద్రతా కార్డులతోపాటు ఇతర సమస్యలపై కూడా దృష్టిసారించామని తెలిపారు. కాగా, సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా వెంటనే నిర్ణయం తీసుకొంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీనిచ్చారు.

దుర్గం చెరువు ఆక్రమణలను తొలగించండి

- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ దుర్గం చెరువులో ఆక్రమణలను తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. చెరువులోకి రసాయన వ్యర్థాలు చేరకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని, చెరువు పరిరక్షణ కోసం నిపుణుల కమిటీ సమర్పించిన సత్వర ప్రణాళికను అమలుచేయాలని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్ కుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. దుర్గం చెరువులో కాలుష్యం కారణంగా చేపలు మరణించి నీటిపై తేలుతున్నాయంటూ పత్రికల్లో వచ్చిన వార్తలను హైకోర్టు సుమోటోగా తీసుకొని విచారించింది.

ప్రభుత్వ నివేదికపై అసంతృప్తి

చెరువు దుస్థితిని తెలుసుకునేందుకు ఇద్దరు సభ్యులతో ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీతో పాటు ప్రభుత్వం కూడా హైకోర్టుకు వేర్వేరు నివేదికలు సమర్పించాయి. ప్రభుత్వ నివేదికపై అసంతృప్తి వ్యక్తం చేసింది. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని 78 నిర్మాణాలు, బఫర్ జోన్‌లోని 146 నిర్మాణాలను తొలగించడానికి ఏం చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించింది. 100 ఎకరాలుగా ఎఫ్‌టీఎల్‌ను ఖరారు చేస్తూ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం ఆ మేరకు తుది నోటిఫికేషన్ ఎందుకు జారీ చేయలేదని నిలదీసింది. దుర్గం చెరువు రక్షణకు తామిచ్చిన ఆదేశాల అమలు ఎలా జరుగుతున్నదో ఇదే కమిటీతో నివేదిక తెప్పించుకుంటామని హైకోర్టు వెల్లడించింది. తదుపరి విచారణను ఈ నెల 11కు వాయిదా వేసింది.

అదానీ కృష్ణపట్నం పోర్టులో ప్రమాదం

హైదరాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణపట్నం పోర్టులో జరిగిన ప్రమాదంలో ఇద్దరు ఉద్యోగులు దుర్మరణం పాలయ్యారు. నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం అదానీ కృష్ణపట్నం పోర్టుకు ఇండోనేషియా నుంచి ఓ నౌక బొగ్గు లోడ్ వచ్చింది. లోడింగ్ పూర్తయిన తర్వాత క్యాజువల్ ఉద్యోగులు నౌకలోని ట్యాంకర్ శుభ్రం చేస్తుండగా గ్యాస్ లీకేజీ అయ్యింది. ఈ దుర్ఘటనలో క్యాజువల్ ఉద్యోగులు ఖదీర్, ప్రశాంత్ మృతి చెందగా మరికొందరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీలో ఒంటరిగానే బరిలోకి బీజేపీ

- టీడీపీ-జనసేన కూటమికి షాక్

హైదరాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ): ఏపీ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. సార్వత్రిక ఎన్నికల వేళ టీడీపీ-జనసేన కూటమికి బీజేపీ షాకిచ్చేందుకు సిద్ధమయ్యింది. నిన్న మొన్నటిదాకా టీడీపీ, జనసేన పొత్తు ఉంటుందని భావించినప్పటికీ.. ఇప్పుడు బీజేపీ సొంతంగానే ఎన్నికల బరిలోకి దిగాలని యోచిస్తున్నట్టు తెలుస్తున్నది. ఆపరేషన్ ఆంధ్రప్రదేశ్ పేరుతో బీజేపీ కొత్త స్కెచ్ వేస్తున్నది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ సీఎం నినాదంతో ముందుకెళ్లిన కాషాయ పార్టీ ఏపీలోనూ కాపు సీఎం నినాదంతో ముందుకెళ్లాలని అధిష్ఠానం అభిప్రాయపడినట్టు ఆ పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు. టీడీపీ నుంచి కమ్మ, వైసీపీ నుంచి రెడ్లు సీఎంలుగా ఉన్నారు. ఏపీలో అతిపెద్ద సామాజికవర్గమైన కాపుల్లో ముఖ్యమంత్రులు లేరు. కాపు నేతగా పవన్‌కళ్యాణ్‌కు మంచి గుర్తింపు ఉన్నా ఆయన సొంతంగా బరిలో దిగే ఆలోచనలో లేడు. ఈ నేపథ్యంలో బీజేపీ ఆపరేషన్ ఆకర్ష్‌కు ప్లాన్ చేస్తున్నది. టీడీపీ, వైసీపీలో అసమ్మతి నేతలపై ఫోకస్ పెట్టింది. శని, ఆదివారాల్లో విజయవాడలో జరుగనున్న బీజేపీ కీలక సమావేశాలకు ఢిల్లీ ముఖ్యనేతలు హాజరుకానున్నారు. ఈ సమావేశాల్లోనే బీజేపీ తదుపరి కార్యాచరణపై స్పష్టత వచ్చే అవకాశం ఉన్నది.

పరీక్షలు ముగిసే వరకు డిస్టర్బ్ చేయొద్దు

కారు యాక్సిడెంట్ ఘటనలో పోలీసులకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, మార్చి 1(నమస్తే తెలంగాణ): ప్రజాభవన్ వద్ద బారికేడ్లను ఢీ కొట్టిన ఘటనలో కారులో ఉన్న ఇద్దరు మైనర్ విద్యార్థులను పదో తరగతి పరీక్షలు పూర్తయ్యే వరకు డిస్టర్బ్ చేయొద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. డిసెంబర్ 24న జరిగిన కారు ప్రమాదం కేసులో తమ పిల్లలను సాక్షులుగా చూపించారని, వారి వాంగ్మూలాలు నమోదు చేసేందుకు తరచూ పోలీస్ స్టేషన్‌కు పిలుస్తున్నారని మైనర్‌ల తల్లిదండ్రులు హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ ఇద్దరిలో ఒకరు ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాయాల్సి ఉందని కోర్టు దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ జే అనిల్ కుమార్‌తో కూడిన డివిజన్ బెంచ్.. పదో తరగతి పరీక్షలు పూర్తి అయ్యే మార్చి 22 వరకు ఇద్దరు విద్యార్థులను డిస్టర్బ్ చేయొద్దని పోలీసులను ఆదేశించింది. మార్చి 23న మాత్రం పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ముందు పిల్లలు హాజరయ్యేలా తల్లిదండ్రులు చూడాలని, లేకపోతే పోలీసులు చట్టానికి లోబడి తగిన చర్యలు తీసుకోవచ్చని కోర్టు స్పష్టం చేసింది.

భవన ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్ (ఫైల్)

మాయమైన భవన ప్రారంభోత్సవ శిలాఫలకం

'కేసీఆర్ సర్కారు' శిలాఫలకాలు మాయం

- మంథనిలో పాఠశాలలో దుండగుల దుశ్చర్య
- పోలీస్‌స్టేషన్‌లో ప్రధానోపాధ్యాయుడి ఫిర్యాదు
- కాంగ్రెస్ శ్రేణుల పనే అంటూ ఆరోపణలు

మంథని, మార్చి 1: తెలంగాణలో ప్రజాపాలన అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ఊదరగొడుతున్నా.. క్షేత్రస్థాయిలో అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఆనవాళ్లను చెరిపేసే కుట్రలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే మంథని సర్కారు బడిలో భవనం ప్రారంభం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వంలో వేసిన శిలాఫలకాలను ఎత్తుకెళ్లారు. ఇది కాంగ్రెస్ శ్రేణుల పనేనన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వంలో పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ ప్రత్యేక చొరవ చూపి మంథని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పక్కా భవనం నిర్మించేందుకు రూ.184 లక్షలు మంజూరు చేయించారు. 2019 డిసెంబర్ 12న ప్రారంభించి, నిరుడు పూర్తి చేశారు. సెప్టెంబర్ 21న అప్పటి మంత్రి కొప్పుల ఈశ్వర్, ప్రస్తుత జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్‌తో కలిసి ఆ భవనాన్ని ప్రారంభించారు. అయితే భూమిపూజ, భవన ప్రారంభోత్సవ శిలాఫలకాలను గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు శిలాఫలకాలను ఎత్తుకెళ్లినట్టు గుర్తించి.. వెంటనే మంథని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు హెచ్ఎం శ్రీనివాస్ తెలిపారు. ఈ ఘటనను బహుజనసేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు తగరం శంకర్‌లాల్, బీఆర్ఎస్ మంథని మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్ ఖండించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కేసీఆర్ సర్కారు చేసిన అభివృద్ధిని చెరిపివేసే కుట్రలు చేయడం దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. శిలాఫలకాలను ధ్వంసం చేసిన దుండగులను వెంటనే గుర్తించి శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో సోయా కొనుగోళ్లు నిలిచిపోవడంతో పేరుకుపోయిన పంట నిల్వలు

సోయా రైతు పరేషాన్

- పంటను కొంటమన్నరు
- మార్కెట్‌కు తెచ్చిన తరువాత కొనమంటున్నరు
- అధికారుల తీరుతో రైతుల ఆగ్రహం
- కేంద్రం నిరాకరించిదంటున్న అధికారులు
- మార్కెట్‌కు చేరిన 500 క్వింటాళ్ల సోయాబీన్

ఆదిలాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ): సోయా రైతు రోడ్డున పడ్డాడు. సోయాబీన్‌ను కొనుగోలు చేస్తామని అధికారులు ప్రకటిస్తే.. రైతులంతా పంటను మార్కెట్‌కు తరలించారు. గత మూడు రోజులుగా పంటను తరలిస్తుండగా తాజాగా కేంద్రం వెనక్కి తగ్గడంతో కొనుగోలు చేపట్టక అధికారులు చేతులెత్తేశారు. దీంతో అధికారులు మార్కెట్ యార్డులో అవస్థ పడుతున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో రైతులు పత్తి తర్వాత సోయాబీన్ సాగు చేస్తారు. ఏటా జూన్‌లో సోయాను సాగు చేసి అక్టోబర్, నవంబర్ నెలల్లో విక్రయిస్తారు. ప్రభుత్వం సోయా పంటకు ఈ ఏడాది క్వింటాకు మద్దతు ధర రూ.4600 ప్రకటించగా, ధర పెరగుతుందనే ఆశతో కొందరు రైతులు పంటను విక్రయించకుండా నిల్వ చేసుకున్నారు. జిల్లాలో రైతులు వద్ద దాదాపు 1.50 లక్షల క్వింటాళ్ల సోయాబీన్ నిల్వ ఉన్నది. సోయాబీన్ కొంటామని మార్క్‌ఫెడ్ అధికారులు నాలుగు రోజుల కిందట ప్రకటించారు. ప్రాథమిక సహకార సంఘాల ద్వారా మార్కెట్ యార్డుల్లో పంటను మద్దతు ధరకు కొంటామని వెల్లడించారు. ధర పెరిగే అవకాశాలు లేకపోవడం ప్రైవేటు వ్యాపారులు క్వింటాకు రూ.4,200తో కొనుగోలు చేస్తుండటంతో తమ పంటను మార్క్‌ఫెడ్‌కు విక్రయించడానికి రైతులు తీసుకువచ్చారు. ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు శనివారం నుంచి మంగళవారం వరకు దాదాపు 500 క్వింటాళ్ల వరకు సోయాబీన్‌ను అమ్మడానికి తీసుకువచ్చారు.

వెనక్కి తగ్గిన కేంద్రం..

సోయాబీన్ పంట కోతలు ముగిసి 90 రోజులు గడుస్తున్నందున పంట కొనుగోళ్లకు కేంద్రం అభ్యంతరం తెలిపింది. దీంతో అధికారులు కొనుగోళ్లకు నిరాకరించారు. నాలుగు రోజులుగా పడిగాపులు కాస్తుంటే ఇప్పుడు చేతులెత్తేయడంపై భగ్గుమన్నారు. పంటను తిరిగి తీసుకుపోదామంటే రూ. 5 నుంచి రూ.10 వేల వరకు నష్టపోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు.

ఎవరు పట్టించుకుంట లేరు

నేను రెండ్రోజుల కిందట 25 క్వింటాళ్ల సోయాబీన్ తెచ్చిన. వాహనంతోపాటు రెండు రోజులుగా మార్కెట్‌యార్డులో ఉంటున్న ఎప్పుడు కొంటరో చెప్తలేరు. పంటను తిరిగి తీసుకుపోతే మళ్లా రూ.3 వేల కిరాయి అవుతుంది. పంట కొనమని ముందుగా చెబితే తీసుకువచ్చేటోళ్లం కాదు. ప్రభుత్వం స్పందించి పంటను కొనుగోలు చేయాలి.

*–